**155వ అధ్యాయం**

# ١٥٥ - بَابُ الصَّلاَةِ عَلَى الْمَيِّتِ وَتَشْيِيعِهِ وَحُضُورِ دَفْنِهِ وَكَرَاهَةِ اتِّبَاعِ النِّسَاءِ الْجَنَائِزَ

## జనాజా నమాజ్ చేయటం, జనాజా వెంట నడవటం, మృతుని ఖనన సంస్కారాల్లో పాల్గొనటం గురించి, ఇంకా జనాజా వెంట స్త్రీలు వెళ్ళటం అవాంఛనీయం అనే విషయం గురించి.....

وَقَدْ سَبَقَ فَضْلُ التَّشْيِيعِ

జనాజా వెంట నడవటానికున్న ఔన్నత్యం గురించి ఇంతకు ముందే వివరించటం జరిగింది.

٩٢٩ - عن أبي هُرَيرةَ رَضيَ اللهُ عنه قال: قال رسولُ اللهِ ﷺ: «مَنْ شَهِدَ الجنَازَةَ حَتَّى يُصَلَّى عَلَيها، فَلَهُ قِيرَاطٌ، وَمَنْ شَهِدَهَا حَتَّى تُدْفَنَ، فَلَهُ قِيرَاطَانِ» قِيلَ: وَمَا القِيرَاطَانِ؟ قال: «مِثْلُ الجَبَلَيْنِ العَظِيمَيْنِ». متفقٌ عليه.

929. హజ్రత్ అబూ హురైరా (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లం) ఈ విధంగా ప్రవచించారు: ఎవరయినా మృతుని అంత్యక్రియల్లో పాల్గొని నమాజ్ ముగిసేవరకు జనాజా వెంట ఉంటే అతనికి ఒక ఖీరాతు పుణ్యం లభిస్తుంది. ఎవరయినా ఖనన సంస్కారాలు ముగిసేవరకూ జనాజా వెంట ఉంటే అతనికి రెండు ఖీరాతుల పుణ్యం లభిస్తుంది. "రెండు ఖీరాతు లంటే ఎంత?" అని ఎవరో అడగ్గా, దానికి దైవప్రవక్త (సల్లం) "రెండు పెద్ద పర్వతాల అంత" అని సమాధాన మిచ్చారు.

*(బుఖారీ - ముస్లిం)*

*(సహీహ్ బుఖారీ, సహీహ్ ముస్లింలలోని జనాయెజ్ ప్రకరణం)*

٩٣٠ ـ وعنه أنَّ رسـولَ الله ﷺ قـال: «مَـنِ اتَّبعَ جَنَـازَةَ مُسْلِمٍ إيمَـاناً وَاحْتِسَاباً، وكانَ مَعَهُ حَتَّى يُصَلِّي عَلَيها وَيُفرَغَ مِنْ دَفنِها، فإنَّهُ يَرجِعُ مِنَ الأَجْرِ بِقيرَاطَيْنِ كُلُّ قِيرَاطٍ مِثلُ أُحُدٍ، وَمَنْ صَلَّى عَلَيهَا، ثم رَجَعَ قَبْلَ أَن تُدفَنَ، فإنَّهُ يَرجِعُ بِقِيرَاطٍ» رواه البخاري.

930. హజ్రత్ అబూ హురైరా (రజి) గారే చేసిన కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లం) ఈ విధంగా ప్రవచించారు : సంపూర్ణ విశ్వాసంతో, పుణ్యాన్ని ఆశిస్తూ ఒక ముస్లిం జనాజా వెంట నడిచి జనాజా నమాజు చేసి, ఆ తర్వాత ఖనన సంస్కారాలు ముగిసేవరకు శవం వెంట ఉండే వ్యక్తి తిరిగి వెళ్ళేటప్పుడు రెండు ఖీరాతుల పుణ్యం వెంట తీసుకొని వెళ్తాడు. అందులో ఒక్కొక్క ఖీరాతు ఉహుద్ పర్వతమంత ఉంటుంది. అయితే మృతుణ్ణి ఖననం చేయక ముందే కేవలం జనాజా నమాజ్ మటుకు చేసి తిరిగి వెళ్ళే వ్యక్తి ఒక ఖీరాతు పుణ్యం వెంట తీసుకొని వెళ్తాడు.

*(బుఖారీ)*

*(సహీహ్ బుఖారీలోని విశ్వాస ప్రకరణం)*

## ముఖ్యాంశాలు

దేవుని మీద విశ్వాసంతో, ఆయన ప్రసన్నతను బడసే ఉద్దేశ్యంతో జనాజాలో (అంత్యక్రియల్లో) పాల్గొన్నవారికి మాత్రమే పైన పేర్కొనబడిన పుణ్యం లభిస్తుంది. అలాగాకుండా చనిపోయినవాడు కేవలం తమ పొరుగువాడు అనో లేక పెద్ద ఆఫీసరు అనో లేక తమ బంధువు అనో తలచి అతని జనాజాలో పాల్గొంటే అప్పుడు దేవుడు తమకు పుణ్యం ప్రసాదిస్తాడని ఆశించనక్కర్లేదు.

٩٣١ ـ وعن أُمِّ عَطِيَّةَ رَضِيَ الله عنها قالَتْ: نُهِينَا عَنِ اتِّبَاعِ الجَنَائِزِ، وَلم يُعزَمْ عَلَيْنَا» متفقٌ عليه. ومعناه: ولَمْ يُشَدَّد في النَّهيِ كما يُشَدَّدُ في المُحَرَّمَاتِ.

931. హజ్రత్ ఉమ్మె అతియ్యా (రజి. అన్హా) కథనం : మమ్మల్ని జనాజాల వెంట వెళ్ళకుండా వారించటం జరిగేది. అయితే మరీ అంత తీవ్రంగా వారించటం జరిగేది కాదు.

*(బుఖారీ - ముస్లిం)*

'మరీ అంత తీవ్రంగా వారించటం జరిగేది కాద'ంటే, నిషిద్ధ విషయాల్లో తీవ్ర వైఖరి అవలంబించినట్లు ఈ విషయంలో తీవ్రంగా వ్యవహరించటం జరిగేది కాదని అర్థం.

*(సహీహ్ బుఖారీ, సహీహ్ ముస్లింలలోని జనాయెజ్ ప్రకరణాలు)*

## ముఖ్యాంశాలు

జనాజా వెంట స్త్రీలు కూడా బయలుదేరితే స్త్రీ పురుషుల కలయిక వల్ల ఎన్నో అనర్థాలు జరిగే ప్రమాదముంటుందన్న భయంతో స్త్రీలను జనాజా వెంట వెళ్ళకుండా వారించటం జరిగింది. ఇంకో విషయమేమిటంటే స్త్రీలు సాధారణంగా సున్నిత మనస్కులై ఉంటారు. శ్మశానాలు, శవాల్లాంటి భయంకరమైన దృశ్యాల్ని చూసి వారు తట్టుకోలేరు. స్త్రీలను శ్మశానానికి వెళ్ళకుండా వారించటానికి అది కూడా ఒక కారణం కావచ్చు. అయితే అలాంటి అనర్థాలు జరగవన్న నమ్మకముంటే జనాజా వెంట స్త్రీలు కూడా వెళ్ళవచ్చు. దైవప్రవక్త (సల్లం) కాలంలో ఈ విషయంలో తీవ్రవైఖరి అవలంబించబడలేదంటే సమాజ పరిస్థితులను బట్టి కాలానుగుణంగా షరీఅత్ నిర్దేశించిన నియమాలను ఆచరిస్తూ స్త్రీలు కూడా జనాజా వెంట వెళ్ళవచ్చని భావం. అందుకే అత్యధికమంది విద్వాంసులు ఈ వారింపును 'నహీయె తన్‌జీహి'గా పేర్కొంటూ జనాజాల వెంట స్త్రీలు వెళ్ళకుండా ఉండటమే అన్ని విధాలా ఉత్తమమని అభిప్రాయపడ్డారు.

*(ఫత్‌హుల్ బారీ)*